
విపణితో పరిశ్రమ అభివృద్ధి

ఈనాడు, సిరిసిల్ల

జిల్లాలో చేతిరుమాలు మొదలు.. పట్టు చీరలు నేసే నైపుణ్యం ఉన్న నేత కళాకారులు ఉన్నారు. వస్త్రోత్పత్తుల్లో ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. ఇక్కడ నాణ్యత, నవ్యతతో కూడిన వస్త్రాలు ఉత్పత్తి అవుతున్నా వాటికంటూ ప్రత్యేక గుర్తింపులేదు. ప్రభుత్వం ఇటీవల జిల్లాకు నూలు బ్యాంకును మంజూరు చేసింది. దీంతో చిన్న, మధ్య తరగతి ఆసాములకు పెట్టుబడులకు కొంత ఊరట లభిస్తుంది. జిల్లాలోని 31 వేల పైన ఉన్న మరమగ్గాలపై కాటన్, పాలిస్టర్ నూలుతో ఎలాంటి ఉత్పత్తులైనా తీసుకురావచ్చు. ఆసాములు ఒక్కొక్కరుగా సొంత ఉత్పత్తుల వైపు వెళ్తున్నారు. చేతిరుమాళ్లు, తువ్వాళ్లు, లుంగీలు, దోమతెరలు, కాటన్ కండువాల ఆర్డర్లు వస్తున్నాయి. ఇదే క్రమంలో ఇక్కడ తయారవుతున్న వస్త్రాలను స్థానికంగానే విపణి (నేత బజారు) ఏర్పాటు చేస్తే పరిశ్రమ అభివృద్ధి, నైపుణ్యాల విస్తరణకు అవకాశం ఉంటుంది.

నేతన్నల నైపుణ్యాల విస్తరణకు అవకాశాలు



మరమగ్గాలపై వస్త్రోత్పత్తులు

రూ.వెయ్యి కోట్ల మార్కెట్ సామర్థ్యం

జిల్లా వస్త్రోత్పత్తుల విపణి సామర్థ్యం ఏటా రూ.వెయ్యి కోట్లు ఉంటుంది. దీనికి అనుబంధంగా అపరెల్ పార్కులోనూ రెండు యూనిట్లు ప్రారంభమయ్యాయి. పరిశ్రమ విస్తరించే అవకాశం ఉంది. రెండేళ్ల క్రితం ఆదిత్య బిర్లా తమ వస్త్రోత్పత్తుల మార్కెటింగ్‌శాఖను ఇక్కడ ప్రారంభించేందుకు కంపెనీ ప్రతినిధులు స్థలాన్ని పరిశీలించారు. దాంతోపాటు స్థానిక మరమగ్గాలను పరిశీలించారు. సాధారణ, రాపియర్ మరమగ్గాలపై విస్కోస్, కాటన్ నూలుతో నమూనా వస్త్రాలను తయారు చేయించారు. వీటి తయారీలో నైపుణ్యాలు, ఉత్పత్తి వ్యయం, కార్మికుల ఉపాధి తదితర అంశాలపై కూడా అధ్యయనం చేశారు. తర్వాత ఆ సంస్థ ఇటువైపు రాలేదు.

మార్కెట్‌తో నైపుణ్యాల ప్రదర్శన



రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక డిజైన్లతో చీరలను అందిస్తున్నాం. మేము నేసిన చీరలకు డైయింగ్, ప్రింటింగ్, చేతితో డిజైన్లు వేస్తాం. వస్త్రోత్పత్తులతోపాటు నైపుణ్యం ఉన్న గార్మెంట్ నడిపే మహిళలు ఉపాధి పొందుతున్నారు. ఆర్డర్లు తీసుకొచ్చుకోవడంతో సమయం వృథా అవుతుంది. ప్రభుత్వం స్థానికంగా మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే నేతన్నలు వారి నైపుణ్యాల ప్రదర్శనకు అవకాశం ఉంటుంది. **- రఘు కుమార్**

పెట్టుబడులకు ఇబ్బందులు ఉండవు



తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటకలోని వ్యాపారుల నుంచి ఏటా దుప్పట్ల ఆర్డర్లు వస్తుంటాయి. ఆయా ప్రాంతాలకు వెళ్లి ఆర్డర్లు తీసుకొచ్చి నాతోపాటు మరికొంత మంది ఆసాములకు ఉపాధి కల్పిస్తున్నాను. స్థానికంగా మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే వ్యాపారులే ఇక్కడికి వచ్చే అవకాశం ఉంటుంది. అప్పుడు మన దగ్గర సామర్థ్యం మేరకు ఆర్డర్లు ఇస్తారు. దీంతో ముందస్తు పెట్టుబడులకు ఇబ్బందులు ఉండవు. **- బైరి అమర్**

సొంతంగా డిజైన్లు చేస్తా



బతుకమ్మ చీరల సమయంలో డాబీ, జకార్డులపై డిజైన్లు వేయడం నేర్చుకున్నాను. వస్త్రోత్పత్తుల ఆర్డర్లను బట్టి మరమగ్గాల్లో మార్పులు చేసుకోవడం, దానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని నేనే సమకూర్చుకుంటాను. నాతోటి ఆసాములకు పనిలో మెలకువలు నేర్పుతున్నాను. నా పని తీరు చూసిన వ్యాపారులు బుట్టచీరల ఆర్డర్లు ఇచ్చారు. వీటికి స్థానిక మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. **- సామల వేణు**

కాటన్ శాలువాల ఆర్డర్లు



ప్రభుత్వ ఆర్డర్లపైన ఆధారపడితే మనుగడ కష్టం. రాష్ట్రంలోని ప్రధాన నగరాలతోపాటు బెంగళూరు, చెన్నైలలోని కాటన్ టోకు వ్యాపారులకు వస్త్రాలను తయారు చేసి ఇచ్చేవాడిని. నాతోపాటు సిరిసిల్లలోని మరో నలుగురు ఆసాములం కలిసి కాటన్ ఆర్డర్లు తీసుకుని ఉత్పత్తి చేస్తున్నాం. వీటిలో ఇటీవల కాటన్ శాలువాల ఆర్డర్లు పెరిగాయి. **- దూస తిరుపతి**

అక్రమాలకు 'వే'

ఇష్టారీతిన వాగులో తవ్వకాలు

మానాల్లోని మానేరు వాగు నుంచి ఇసుక తరలించడానికి బోయినపల్లి తహసీల్దారు కార్యాలయం నుంచి ఈ నెల 21న వే బిల్లులు జారీ చేశారు. పోలీసులు వాహనాల తనిఖీ సమయంలో కార్యాలయం నుంచి వే బిల్లు జారీ తేదీ 21 ఉండగా, తరలింపు తేదీ ఈ నెల 22 ఉండటాన్ని గుర్తించారు. అక్రమ రవాణాకు వే బిల్లు ఉపయోగించారని మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఒక రోజు ముందు తేదీతో ఎలా వే బిల్లు జారీ చేస్తారన్న అనుమానాన్ని పోలీసులు వ్యక్తం చేశారు.

న్యూస్‌టుడే, బోయినపల్లి

గ్రామాల్లో అభివృద్ధి పనులు, స్థానిక అవసరాల కోసం ఇసుక రవాణాలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండటానికి జిల్లా యంత్రాంగం ఇసుక తరలించడానికి అనుమతులు ఇస్తుంది. ఇదే అదనుగా కొందరి అధికారుల అండతో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. నిబంధనలు అతిక్రమించి ఇష్టారీతిన ఇసుక రవాణా చేయడంతో పాటు మధ్యమానేరు జలాశయం కట్ట కింద, రైతుల వ్యవసాయ మోటార్ల సమీపంలో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు.



పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

బోయినపల్లి మండలం మాన్వాడ, మల్లాపూర్‌లో మానేరు వాగు ఉంది. మాన్వాడ వద్ద ఉన్న మధ్యమానేరు జలాశయం కట్ట కింద వాగు ఉండటంతో ఇక్కడ ఇసుక తవ్వకాలు చేపట్టడం సరికాదని గతంలో ఇంజినీరింగ్ అధికారులు స్పష్టం చేశారు. అయితే అభివృద్ధి పనులు, స్థానిక అవసరాల కోసం ఇసుక లభ్యత లేకపోవడం వల్ల నిబంధనలు పాటించి ఇసుక తరలించడానికి మాన్వాడ నుంచి అనుమతులు ఇవ్వాలని అధికారులు కోరారు. ఇదే అదనుగా కొందరు ఇసుకాసురులతో చేతులు కలిపి అక్రమ రవాణాకు తెరలేపారు. జలాశయం కట్ట కింద, రైతుల వ్యవసాయ మోటార్లు, బోర్లు, బావుల సమీపంలో తవ్వకాలు చేపడుతున్నారు.

ఇలా చేయాలి..

ఇసుక అవసరం ఉన్న వారు సంబంధిత అధికారి ధ్రువీకరించిన తర్వాత రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని చలానా చెల్లించాల్సి ఉంటుంది. ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టరు నంబరు, ఎక్కడికి రవాణా చేస్తున్నారో తెలపాలి. అయితే ఇక్కడ ఇసుక అవసరం ఉన్న వారి కంటే అధికంగా ట్రాక్టరు యజమానులే వారికి సంబంధించిన పేర్లతో చలానాలు కట్టి వే బిల్లులు పొందుతున్నారు. వాగు వద్ద రెవెన్యూ కార్యాలయానికి చెందిన ఓ అధికారి విధుల్లో ఉండి వే బిల్లులు జారీ చేస్తున్నారు. అయితే సదరు అధికారి చూసీ చూడనట్లు వ్యవహరించడంతో ఒకే వే బిల్లుపై నాలుగు ట్రిప్పులు రవాణా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది.

పోలీసులకు సమాచారం ఏది?

ఇసుక రవాణాకు సంబంధించి వే బిల్లులు ఇస్తున్న క్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండటానికి, పోలీసులు వాహన తనిఖీల సమయంలో సమాచారం కోసం ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సంబంధిత గతంలో పోలీసులకు సమాచారం ఇచ్చేవారు. ప్రస్తుతం ఇతర మండలాల్లో పోలీసులకు సమాచారం అందిస్తున్నారు. అయితే ఇక్కడ మాత్రం వే బిల్లులు మంజూరు చేసే సమయంలో పోలీసులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు.

నిబంధనలు పాటించాలి



ఇసుక రవాణా విషయంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఈ రోజే బాధ్యతలు స్వీకరించడం వల్ల రెండు రోజుల క్రితం జారీ చేసిన వే బిల్లుల విషయం నాకు తెలియదు. అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.
- నారాయణరెడ్డి, తహసీల్దారు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



భోజనశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణను అలవరుచుకొని, అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం పరీక్షల కోసం విద్యార్థులు చదువుతుండగా వారి వద్దకు వెళ్లి పలు అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల కోసం సిద్ధం చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, పాఠశాలలో మొత్తం ఎంత మంది ఉన్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మొత్తం 807 మంది చదువుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద తెలిపారు. రోజూ ఎప్పటికప్పుడు నోట్స్ తయారు చేసుకొని వాటిని చదవడం, రాయడం ద్వారా వాటిపై పట్టు సాధిస్తారని సూచించారు.

ఇది.. రాజీవ్ రహదారికి ఆనుకొని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో ఉన్న అనంత పద్మనాభస్వామి ఆలయానికి చెందిన భూమి. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొన్నేళ్లుగా కుట్రలు జరిగాయి. స్థానికంగా ఉన్న యువత, గ్రామస్థులు ఈ భూమిని కాపాడేందుకు ఏళ్ల తరబడి పోరాటం చేశారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎట్టకేలకు భూమికి హద్దులు నిర్ణయించాలని కోర్టు ఆదేశించింది. ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్లో గుంటకు రూ.30 లక్షల దాకా ఉంటుంది. దేవుడి పేరిట రెండు వేర్వేరు సర్వే నెంబర్లలో ఇక్కడ 10.10 ఎకరాల భూమి ఉంది. ఈ భూమికి ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు హద్దులు నిర్ణయించి ప్రహరీ నిర్మిస్తే దేవుడి మాన్యానికి రక్షణ ఉంటుంది.



ఆక్రమణలో 818 ఎకరాల ఆలయ స్థలాలు

దేవుడి భూమినీ వదలడం లే!

ఈనాడు, కరీంనగర్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు సంబంధించిన భూములు కాలక్రమేణా ఆక్రమణకు గురవుతున్నాయి. 1955-56 కాస్రా పహాణితో పోలిస్తే ఇప్పుడు రికార్డుల్లో ఉన్న విస్తీర్ణం తగ్గింది. దేవాదాయ శాఖ అధికారులు చెప్పిన వివరాల మేరకే 818 ఎకరాలు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లాయి. ఇది ధరణి పోర్టల్‌లో ఉన్న ప్రస్తుత లెక్కల ప్రకారం. కాని అనధికారికం సుమారుగా 1500 ఎకరాల వరకు ఆలయాల భూమి కబ్జా చెరలో చిక్కుకున్నట్లు సమాచారం. ఆలయ భూములను ఆనుకుని ఉన్న వారు హద్దులు చెరిపేస్తూ ఆక్రమించడం, ఆ తరువాత కోర్టులను ఆశ్రయించడంతో ఏటా కొంత భూమిని దేవాదాయ శాఖ కోల్పోతూ వస్తోంది. అధికారులు మారుతుండటం, గ్రామాల్లో ఆలయ భూములెక్కడ ఉన్నాయో స్పష్టత లేకపోవడంతో సంరక్షణ కష్టసాధ్యమవుతోంది.

జిల్లా	ఆలయాలు	విస్తీర్ణం (ఎకరాల్లో)	ఆక్రమణ (ఎకరాల్లో)
కరీంనగర్	101	713.04	144.30
జగిత్యాల	118	1,173.34	86.29
పెద్దపల్లి	111	1,131.09	551.36
సిరిసిల్ల	93	617.18	35.01
మొత్తం	423	3635.25	818.16


ఊరూరా ఇదే తీరు..!

హుజూరాబాద్ హనుమాన్ ఆలయానికి చెందినవి 1.14 ఎకరాలు, సిరిసిల్ల వేంకటేశ్వర స్వామి ఆలయ పరిధిలో 1.15 ఎకరాలు, పెద్దపల్లి గోశాలలో 1.13 ఎకరాలు, పెద్దపల్లి సీతారామస్వామి ఆలయ పరిధిలో 8.32 ఎకరాలు, జగిత్యాల రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిధిలో 2.04 ఎకరాలు, కోరుట్ల వేంకటేశ్వరస్వామి ఆలయానివి.. 20 గుంటలు, జగిత్యాల రాంమందిర్ భూమి 19 గుంటలు, పెద్దపల్లి నర్సింహస్వామి భూమి 13.20 ఎకరాలు, కొండగట్టు ఆలయ భూములు రెండెకరాలు.. ఇలా అన్ని గ్రామాలు, పట్టణాల్లోని ఆలయ భూములు ఆక్రమణల్లో చిక్కుకున్నాయి. ఇందులో చాలామంది ఆక్రమణదారులు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో తిరిగి స్వాధీనం చేసుకోవడం యంత్రాంగానికి సవాలుగా మారుతోంది. కొన్ని కేసుల్లో దేవాదాయశాఖకు అనుకూలంగా తీర్పులు రావడంతో.. వీటిని సెక్షన్-84 ప్రకారం పోలీసులు, రెవెన్యూ సహకారంతో స్వాధీనపర్చుకుంటున్నారు.

స్వాధీనం చేసుకుంటాం

ఎట్టి పరిస్థితుల్లో దేవుడికి సంబంధించిన గుంట భూమిని కూడా ఆక్రమణదారులకు వదిలిపెట్టం. కచ్చితంగా స్వాధీనపర్చుకుంటాం. చాలా కేసుల్లో మా శాఖకు అనుకూలంగా తీర్పులు వస్తున్నాయి. త్వరలోనే రెవెన్యూ అధికారుల సహకారంతో సర్వేలు నిర్వహించి హద్దులు ఏర్పాటు చేస్తాం. ఇదే సమయంలో ధరణి పోర్టల్‌లో ఉన్న రికార్డుల ఆధారంగా ప్రతి జాగాను కాపాడే ప్రయత్నం చేస్తున్నాం. ఇందుకు సంబంధించి ఉన్నతాధికారులకు లేఖ రాశాం.
- సుప్రియ, దేవాదాయశాఖ సహాయ కమిషనర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా

పురాతన బురుజుకు పూర్వవైభవం



ముస్తాబాద్ మండలం నామాపూర్ బురుజుకు నాలుగు వందల ఏళ్లకుపైగా చరిత్ర ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామ జనాభా 3,556 ఉంది. నాలుగు వందలకుపైగా చరిత్ర ఉన్న బురుజు గ్రామ ప్రధాన కూడలిలోని పంచాయతీ కార్యాలయం ఎదుట ఉంది. కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కేకే మహేందర్‌రెడ్డి చొరవతో దాదాపు రూ. 1.50 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టి రంగులు వేసి ముస్తాబు చేశారు. అందంగా తీర్చిదిద్దడంతో పూర్వ వైభవం సంతరించుకుంది. ఇది చూపరులను ఆకట్టుకుంటోంది. **- న్యూస్‌టుడే, ముస్తాబాద్**

పీఎంఎఫ్‌ఎంఈ రుణాలు మంజూరు చేయండి

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటుకు ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఈ) కింద బ్యాంకర్లు త్వరగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో పీఎంఎఫ్‌ఎంఈపై సంబంధిత అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. దరఖాస్తుల స్థితిగతులను, రుణాల మంజూరు, యూనిట్‌ల ఏర్పాటు ప్రక్రియను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 272 యూనిట్ల ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయగా, 214 యూనిట్లకు పంపిణీ పూర్తి చేశామన్నారు. 170 యూనిట్లు ప్రారంభించినట్లు వెల్లడించారు. 119 యూనిట్లకు రాయితీ వచ్చిందని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల దగ్గర పెండింగ్ ఉన్న 73 దరఖాస్తులను పరిశీలించి త్వరగా అర్హత ప్రకారం రుణాలు మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. జిల్లాలో మరో 16 ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటుకు మంజూరు చేసిన రుణాలు పంపిణీ చేయాలని తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా రుణాలు మంజూరు చేసి సరైన డాక్యుమెంట్లు ఇవ్వని కారణంగా 42 దరఖాస్తులను తిరస్కరించినట్లు బ్యాంకర్లు వెల్లడించారు. ఆ దరఖాస్తుదారులు మరోసారి ఆసక్తి కనబరిస్తే నూతనంగా దరఖాస్తు చేసుకోవడానికి సహకరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, ఎల్‌డీఎం మల్లికార్జున్, డీఐసీ ఇన్‌ఛార్జి డీఎం భారతి, రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ దివ్యశ్రీ, డీఆర్‌పీ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కమతాల్లో తడారక.. వరి కోతలు సాగక

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట

వరిపైరు కోత దశకు వచ్చిన ప్రస్తుత తరుణంలో అకాల వర్షాల భయం అన్నదాతలను వెంటాడుతోంది. వర్షానికి ఓ వైపు వరిపైరు నేల వాలుతుండగా, మరోవైపు కమతాలు తడారడం లేదు. దీంతో బురద, తడినేలలు, నీటితో ఉన్న కమతాల్లో నడిచే ఫోర్‌వీలర్, ట్రాక్ యంత్రాలను వరి కోతలకు వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా అన్నదాతలపై అదనపు భారం పడుతోంది.

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో వరిని 1,79,672 ఎకరాల్లో సాగు చేశారు. అందులో 13,552 ఎకరాల్లో సన్నరకం, 1,66,123 ఎకరాల్లో దొడ్డు రకాలున్నాయి.

- సన్నరకం దాదాపు 27 వేల మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం సుమారు 3.82 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. మొత్తంగా 4.09 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.
- జిల్లాలోని 13 మండలాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202, ఐకేపీ పరిధిలో 44, మిగతా శాఖల పరిధిలో 12 కలుపుకొని మొత్తం 258 కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.
- జిల్లా వ్యాప్తంగా 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానున్నట్లు అంచనా వేశారు.



వ్యవసాయ పొలం వద్దే వ్యాపారి తూకం వేసిన బస్తాలను లారీలోకి చేర్చుతున్న హమాలీలు

ట్రాక్ యంత్రాల వినియోగంతో ఆర్థిక భారం

పెరుగుతున్న ఖర్చులు

వరి కోతలకు సాధారణంగా టూవీలర్ యంత్రాలను రైతులు వినియోగిస్తుంటారు. అకాల వర్షాలకు కమతాలు బురదమయంగా మారడం, వర్షపు నీరు చేరుతుండటంతో టూవీలర్ యంత్రాలు పని చేయడం లేదు. కొద్దిపాటి తడితో ఉన్న పొలాన్ని కోసేందుకు ఫోర్‌వీలర్ యంత్రాలను, బురద, నీటితో నిండిన చేలను కోసేందుకు ట్రాక్ యంత్రాలను తప్పనిసరిగా వినియోగించాల్సి వస్తోంది.

- టూవీలర్ యంత్రానికి గంటకు రూ.1,800 నుంచి రూ.2 వేలు, ఫోర్‌వీలర్‌కు రూ.2,300 నుంచి రూ.2,500, ట్రాక్ యంత్రానికి రూ.2,800 నుంచి రూ. 3 వేలు ధర చెల్లిస్తున్నారు.
- ఫోర్‌వీలర్, ట్రాక్ యంత్రాలతో వరికోతలకు అవుతున్న ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి.

కల్లాల్లోనే కాంటాలు

అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో నిబంధనల ప్రకారం ధాన్యాన్ని తేమ శాతం 17 లోపు వచ్చేంత వరకు ఆరబెట్టడం రైతులకు కష్టంగా మారుతోంది. ధాన్యం ఆరబెట్టేందుకు, కుప్పలపై కప్పేందుకు తీసుకొచ్చే ప్లాస్టిక్ కవర్లకు అద్దె, కూలీల వినియోగానికి ఖర్చులు పెరిగిపోతున్నాయి.

- వరి పైరు కోసిన వెంటనే తేమశాతంతో సంబంధం లేకుండా, రైతులకు హమాలీ, రవాణా తదితర ఖర్చులు లేకుండానే వారి వ్యవసాయ పొలాలు, కల్లాల్లోనే ధాన్యాన్ని తూకం వేసి, మిల్లులకు తరలిస్తున్నారు.
- 50 కిలోల బస్తాకు 1.50 కిలోలు అదనంగా తూకం వేస్తామని, 10 నుంచి 15 రోజుల వరకు డబ్బులు ఇస్తామని వ్యాపారులు చెబుతున్నప్పటికీ రైతులు అందుకు అంగీకరిస్తున్నారు. క్వింటాకు రూ. 1,840 నుంచి రూ.1,880 వరకు వ్యాపారులు చెల్లిస్తున్నారు.



బురద, నీటితో ఉన్న కమతాల్లోని వరిని కోస్తున్న ట్రాక్ యంత్రం

వ్యాపారికి అమ్మేశా



నాకు ఉన్న నాలుగెకరాల్లో వరి పంటను సాగు చేశాను. ఇటీవలే ఫోర్‌వీలర్ యంత్రంతో వరి కోత పూర్తి చేశాను. అప్పుడప్పుడు వర్షాలు పడుతుండటంతో వడ్లను ఆరబెట్టలేకపోయాను. దీంతో క్వింటా రూ.1,850 చొప్పున వ్యాపారికి విక్రయించాను.
- రైతు, బుర్రవేణి రాములు, రాచర్ల బొప్పాపూర్

అదనపు ఖర్చు తగ్గించుకునేందుకే...



నేను ఏడెకరాల్లో దొడ్డు రకం, మరో ఎకరం విస్తీర్ణంలో సన్న రకం వరి పంటను సాగు చేశాను. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించడం, అక్కడ ఆరబెట్టడం, కుప్పలుగా చేయడం, ప్లాస్టిక్ కవర్లకు అద్దె చెల్లింపులు, హమాలీ, ఇతర కూలీల ఖర్చులను తగ్గించుకోవాలని భావించాను. తేమతో ఉన్న ధాన్యాన్ని మా పొలం వద్దే కుప్పగా పోసి, క్వింటా రూ.1,860 చొప్పున వ్యాపారికి విక్రయించాను.
- చెప్యాల జగన్‌రెడ్డి, రైతు, రాచర్ల బొప్పాపూర్

నిండు జీవితానికి రెండు చుక్కలు...

నేడు ప్రపంచ పోలియో దినోత్సవం



న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

ఒకప్పుడు ప్రపంచాన్ని వణికించిన పోలియో మహమ్మారిని సమూలంగా తరిమి కొట్టడంలో 'రెండు చుక్కలు' కీలకమయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 3.5 లక్షల పోలియో కేసులు నమోదు అవుతుండగా వైద్య ఆరోగ్య శాఖతో పాటు వివిధ వర్గాలు తీసుకున్న చర్యలతో ఒకటి రెండు దేశాల్లో మినహా ప్రపంచ వ్యాప్తంగా పోలియో మహమ్మారిని నిర్మూలించారు. పోలియో కేసులు నమోదవుతున్న దేశాల నుంచి వచ్చే వారి ద్వారా ఇతర దేశాల్లోనూ వ్యాపించే ప్రమాదముందని భావించి ఏటా రెండుసార్లు అయిదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయిస్తున్నారు. అఫ్గనిస్తాన్, పాకిస్థాన్‌లో పోలియో వైరస్ ఉన్నట్లు గుర్తించగా 2022లో ఆగ్నేయ ఆఫ్రికాలో పాకిస్థాన్‌నుంచి సంక్రమించిన వైరస్‌ను గుర్తించి ప్రపంచ వ్యాప్తంగా దీనిని అరికట్టేందుకు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

■ పోలియో టీకా అభివృద్ధి చేసిన వైద్య పరిశోధన బృందానికి నాయకత్వం వహించిన జోనాస్ సాల్క్ జన్మదినోత్సవం సందర్భంగా అక్టోబరు 24న ప్రపంచ పోలియో డే నిర్వహిస్తున్నారు. ఒక్కో సంవత్సరం ఒక్కో నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఈ సారి 'ఎ ఛాన్స్ ఫర్ రిఫ్లెక్షన్ అండ్ రిమైండర్ టు రీచ్ ఎవ్రీ లాస్ట్ చైల్డ్' నినాదంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రణాళిక రూపొందించింది.

నిరంతర పర్యవేక్షణ

పోలియో వైరస్ అయిదేళ్ల లోపు చిన్నారులను అత్యధికంగా ప్రభావితం చేస్తుంది. మల, నోటి మార్గం ద్వారా ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుంది. ఇది పేగుల్లో చేరి నాడీ వ్యవస్థలోకి ప్రవేశించి పక్షవాతానికి కారణమవుతుంది. అరుదుగా సోకే అంటువ్యాధి అయినప్పటికీ ఈ వైరస్ మెదడులోని కొన్ని కణాలను భారీగా దెబ్బ తీస్తుంది. పోలియో మహమ్మారిని సమూలంగా నిర్మూలించినప్పటికీ ఎప్పుడైనా వ్యాపించే ప్రమాదముందనే భావనతో ప్రపంచ వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉంటూ చర్యలు చేపడుతోంది. పదిహేనేళ్ల లోపు పిల్లల్లో పక్షవాతం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వారి రక్త నమూనాలను సేకరించి పుణెలోని పరిశోధన కేంద్రానికి పంపుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఏటా సుమారుగా పాతికకు పైగా ఇలాంటి నమూనాలను సేకరించి పంపించినప్పటికీ పోలియో సోకినట్లుగా నిర్ధారణ కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

నిర్లక్ష్యం వీడి అవగాహన పెంచుకోవాలి

గత కొన్నేళ్లుగా దేశంలో పోలియో కేసులు నమోదు కావడం లేదు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఈ మహమ్మారి దరిదాపుల్లోకి రాకుండా జాగ్రత్త వహించాలి. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిరంతరంగా పర్యవేక్షిస్తున్నారు. ఏమాత్రం లక్షణాలు కనిపించినా వెంటనే అవసరమైన నమూనాలు సేకరించి నిర్ధారణ కోసం పంపిస్తున్నాం. **- డాక్టర్ ప్రమోద్‌కుమార్, పెద్దపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి**

కాల్‌డేటానే కీలకం



గంగారెడ్డి హత్యకేసులో దర్యాప్తు ముమ్మరం

జగిత్యాల, జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జగిత్యాల గ్రామీణ మండలం జాబితాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అనుచరుడు మారు గంగారెడ్డి హత్య సంచలనం కలిగించగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడు సంతోష్ లొంగిపోయినప్పటికీ హత్యకు ప్రోత్సహించింది ఎవరు అనే కోణంలో పోలీసులు సమాచారాన్ని రాబడుతున్నారు. ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్ కేసుపై ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం పోలీసులు సీన్ ఆఫ్ అఫెన్స్ నిర్వహించారు. విచారణలో నిందితుడు తాను ఒక్కడినే నేరం చేశానని ఒప్పుకొన్నప్పటికీ కాల్‌డేటా ఆధారంగా ఇంకా ఎవరి ప్రమేయం ఉన్నది అనే కోణంలో పోలీసులు దృష్టి సారించారు. కాలడేటాలో దాదాపు 25 మందికిపైగా గుర్తించినట్లు తెలుస్తుండగా అందులో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్న వ్యక్తుల నంబర్లలో ఉన్న వారిని విచారించే అవకాశం ఉంది. బుధవారం సాయంత్రం వరకు నిందితుడు సంతోష్ తప్ప ఎవరిని అదుపులోకి తీసుకోలేదని పోలీసులు తెలిపారు. ఈ కేసు సంచలనం కలిగించటంతో పోలీసు ఉన్నతాధికారులు సైతం ప్రత్యేక దృష్టి సారించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతుందని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

విషాదంలో జాబితాపూర్....

నిత్యం గ్రామంలో అందరితో కలిసి తిరిగే మారు గంగారెడ్డి మృతితో ఆయన స్వగ్రామం జాబితాపూర్‌లో విషాదం నెలకొంది. ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి కేసు దర్యాప్తుపై పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. సన్నిహితులు, బంధువులు ఘటనను జీర్ణించుకోలేకపోతున్నారు. మంత్రి శ్రీధర్ బాబు సైతం హత్య ఘటనపై విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని గాంధీభవన్ నుంచి ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డితోనూ మంత్రి మాట్లాడి పూర్తి స్థాయిలో విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.




బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జీవన్‌రెడ్డి

నిందితుడి వెనుక ఉన్నది ఎవరు?

నిందితుడు సంతోష్ ఒక్కడే ఈ హత్య చేశాడా? అతని వెనుక ఎవరైనా ఉన్నారా? అనే కోణంలో పోలీసులు అనుమానిస్తున్నారు. జులాయిగా తిరిగే సంతోష్‌కు ఇంత ధైర్యం ఎలా వచ్చిందని కూడా గంగారెడ్డి సన్నిహితులు పేర్కొంటున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు సైతం గ్రామంలో కొందరు అనుమానితులపై పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. నిందితుడి కాల్‌డేటాలో కుటుంబ సభ్యులు అనుమానిస్తున్న వ్యక్తుల ఫోన్ నంబర్లు ఉన్నట్లు తెలుస్తోంది. వారిని సైతం విచారిస్తే అసలు నిజం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. నిందితుడిని ఎంత విచారించినా తాను ఒక్కడినే చేశాను.. ఇందులో ఎవరి పాత్ర లేదని చెబుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. నిందితుడు ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకోగా కత్తిని సైతం గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మరికొంత మందిని అదుపులోకి తీసుకొని విచారించే అవకాశం ఉంది. గ్రామంలో బుధవారం కొందరు అనుమానితులను పోలీసులు విచారించారు.

మెకానిక్ నుంచి సినిమాల వైపు


సినిమా, వెబ్ సిరీస్ దర్శకుడిగా రాణిస్తున్న కోరుట్ల వాసి



లా సినిమా చిత్రీకరణలో కమల్ కామరాజుకు సీన్‌ను వివరిస్తున్న గగన్ గోపాల్

కోరుట్ల, న్యూస్‌టుడే: మెకానిక్ నుంచి దర్శకత్వం వైపు మళ్లి.. సినిమా, వెబ్ సిరీస్ దర్శకుడిగా రాణిస్తున్నారు కోరుట్ల పట్టణానికి చెందిన ముల్క గగన్ గోపాల్. మధ్య తరగతి కుటుంబానికి చెందిన గగన్ గోపాల్ ముంబయిలో ద్విచక్ర వాహన మెకానిక్‌లో శిక్షణ పొంది 1992 నుంచి 2007 వరకు కోరుట్ల పట్టణంలో మెకానిక్‌గా పనిచేశారు. సినిమాల పట్ల ఉన్న ఆసక్తితో 2008లో హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో 6 నెలలపాటు శిక్షణ పొందారు. 2009 నుంచి 2013 వరకు ఎనిమిది సినిమాలకు దర్శకత్వ పర్యవేక్షకుడిగా పనిచేశారు. 2018లో ప్రముఖ తెలుగు నటుడు కమల్ కామరాజు హీరోగా 'లా' అనే సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్, దర్శకుడిగా వ్యవహరించారు. కరోనా వల్ల సినిమాలకు కొంత విరామం వచ్చినా 2023లో మొదలుపెట్టిన 'అండర్ వరల్డ్ బిలియనీర్స్' అనే వెబ్‌సిరీస్‌కు దర్శకత్వం వహించారు. ఇందులో బాలీవుడ్, తెలుగు, తమిళ, కన్నడ, మళయాళంకు చెందిన ప్రముఖ నటులు నటించారు. దీనిని అయిదు భాషలలో ఒక్కో ఎపిసోడ్ 30 నిమిషాల చొప్పున మొత్తం 12 ఎపిసోడ్‌లుగా చిత్రీకరించగా ప్రస్తుతం చివరి దశలో ఉంది. 'లా' అనే సినిమాకు స్టోరీ, స్క్రీన్‌ప్లే, డైలాగ్‌లు అందించి మొదటిసారి దర్శకత్వం వహించానని ప్రస్తుతం 'అండర్ వరల్డ్ బిలియనీర్స్' అనే వెబ్ సిరీస్‌కు దర్శకత్వంతోపాటు స్టోరీ, స్క్రీన్‌ప్లే, డైలాగ్‌లు రాశానని అయిదు భాషల్లో విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు గగన్ గోపాల్ తెలిపారు.

విద్యార్థుల సమాచార నిధి... అపార్



త్వరలోనే వివరాలు నిక్షిప్తం

న్యూస్‌టుడే, ఫెర్టిలైజర్ సిటీ

ఇటీవల వరదలు సంభవించినప్పుడు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలన్నీ వరదపాలయ్యాయి. తిరిగి వాటిని పొందేందుకు నానా తంటాలు పడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో వారి ధ్రువీకరణ పత్రాలతో పాటు విద్యావిషయక పురోగతిని డిజి లాకర్‌లో భద్రపరచుకునేలా ప్రభుత్వం 'అపార్' రూపొందించింది. విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రి(అపార్)లో భద్రపరచనున్నారు. జాతీయ స్థాయిలో ప్రతి విద్యార్థికి జీవితకాలం ఉపయోగపడే 12 అంకెల గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. దీని ఆధారంగా విద్యార్థుల సమగ్ర వివరాలను 'అపార్'లో నమోదు చేస్తారు. ఈ నెంబరుతో పాటు క్యూఆర్ కోడ్‌తో ప్రతి విద్యార్థికి గుర్తింపు కార్డు జారీ చేస్తారు. ఈ నెంబరు ఆధారంగా విద్యార్థులు ఎక్కడినుంచైనా వారి ధ్రువీకరణ పత్రాలను పొందే వీలుంటుంది. ఆయా అంశాలకు సంబంధించి పురోగతిని ఆయా పాఠశాలల నిర్వాహకులు ఎప్పటికప్పుడు అపార్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతుంది. విద్యార్థులు వేరే విద్యాసంస్థల్లోకి మారినప్పుడు, ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునేటప్పుడు ఈ వ్యవస్థ సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచుతుంది.

తల్లిదండ్రుల సమ్మతి తప్పనిసరి

పాఠశాల విద్యార్థులు మైనర్లు కావడంతో చట్ట, నైతిక ప్రమాణాలను, వ్యక్తిగత సమాచారాన్ని నిక్షిప్తం చేసేందుకు తప్పనిసరిగా తల్లిదండ్రుల సమ్మతి అవసరం. 'అపార్' ఐడీని రూపొందించేందుకు తల్లిదండ్రుల అనుమతి కోరుతూ సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అనుమతి పత్రాలను సేకరిస్తున్నారు. ఇటీవల జరిగిన పోషకుల సమావేశంలో 'అపార్'పై అవగాహన కల్పించి అనుమతి పత్రాలను తీసుకుంటున్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన అనుమతి పత్రాలను పాఠశాలలో భద్రపరిచి దాని డిజిటల్ కాపీని పాఠశాల సమన్వయకర్త ద్వారా యుడైస్ ప్లస్ పోర్టల్‌లో నిక్షిప్తం చేస్తారు.



వెబ్‌సైట్ హోమ్‌పేజీ

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వివరాలు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
జగిత్యాల	1,165	1,59,585
కరీంనగర్	1,071	1,57,648
పెద్దపల్లి	784	98,240
సిరిసిల్ల	659	87,390

భవిష్యత్తులో కీలకం

విద్యార్థులకు భవిష్యత్తులో 'అపార్' కీలకం కానుంది. తల్లిదండ్రులు తమ సమ్మతి పత్రాలను ప్రధానోపాధ్యాయులకు అందజేయాలి. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుంది. ఆయా వివరాల నమోదుపై ఇప్పటికే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. తల్లిదండ్రుల్లో అవగాహన కల్పిస్తూ సమ్మతి పత్రాలను తీసుకునేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలి. **- బి.సుదర్శన్‌రెడ్డి, సమన్వయకర్త, రామగుండం**

జాతీయ స్థాయిలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇప్పటికే 'యుడైస్ ప్లస్' సైటలో వివరాలు నమోదు చేశారు. వాటి అనుగుణంగా 'అపార్' కార్డు కోసం ప్రధానోపాధ్యాయుడి ధ్రువీకరణతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ప్రత్యేకతలు... ప్రయోజనాలు

ఐడీ వచ్చిన తరువాత ధ్రువీకరణ కోసం తల్లిదండ్రులు నమోదు చేసుకున్న ఫోన్‌నెంబరుకు నిర్ధారణ కోసం ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేయగానే ఆన్‌లైన్‌లో 'అపార్' గుర్తింపు కార్డు జారీ చేస్తారు. విద్యార్థి బ్యాంకు ఖాతా వివరాలతో ఇది అనుసంధానమవుతుంది. విద్యార్థి ప్రవేశ పరీక్షలు, ఉపకార వేతనాలు, ఉద్యోగాల భర్తీ సమయంలో ఇది కీలకం కానుంది.

గుర్తింపు కార్డు నమూనా →



రైల్వే అభివృద్ధి ప్రతిపాదనలపై నేడు సమావేశం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో సమస్యల పరిష్కారం, అభివృద్ధి ప్రతిపాదనలపై చర్చించేందుకు గురువారం అధికారులు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో సమావేశం నిర్వహించనున్నారు. ద.మ.రై. జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మన రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు పలు పనులను ప్రతిపాదించనున్నారు. వీటిలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి విశాఖ-శిర్డీ మధ్య నడిచే సాయినగర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను పెద్దపల్లి, నిజామాబాద్ మీదుగా మళ్లించడం, కాచిగూడ-కరీంనగర్ మధ్య నడిచే డెమోను పెద్దపల్లి వరకు పొడిగించడం, జగిత్యాలలోని లింగంపేట రైల్వే ప్లాట్‌ఫాంను విస్తరించడంతో పాటు పెద్దపల్లి, నిజామాబాద్ రైల్వే లైన్‌ను డబ్లింగ్ చేయాలనే ప్రతిపాదనలున్నాయి.

నాణ్యమైన పత్తికే సీసీఐ మద్దతు ధర

ఆర్‌జేడీఎం శ్రీనివాస్

జమ్మికుంట, న్యూస్‌టుడే: నాణ్యమైన పత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చి ప్రభుత్వ కనీస మద్దతు ధరను పొందాలని వరంగల్ ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకులు(ఆర్‌జేడీఎం) శ్రీనివాస్ సూచించారు. బుధవారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆర్‌డీడీఎం పద్మావతి, కరీంనగర్ డీఎంవో ప్రకాష్, ఆర్డీవో రమేశ్‌బాబుతో కలిసి ప్రారంభించారు. మొదటిరోజు ఓ రైతు విక్రయానికి తీసుకువచ్చిన ట్రాక్టర్ పత్తికి క్వింటాలు రూ.7,270.37 చొప్పున సీసీఐ బాధ్యులు చంద్రశేఖర్ ఖరీదు చేశారు.


8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే..: ఆర్‌జేడీఎం మాట్లాడుతూ.. మద్దతు ధర పొందేందుకు నాణ్యమైన, నాణ్యతలేని పత్తిని వేర్వేరుగా విక్రయానికి తీసుకురావాలన్నారు. నాణ్యతను బట్టి 8 శాతం నుంచి 12 శాతం తేమ ఉంటే సీసీఐ రూ.7,521 నుంచి రూ.7,220.16 దాకా చెల్లిస్తుందన్నారు. నీళ్లు చల్లి, రంగుల మారిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదనే విషయాన్ని రైతులు గుర్తుంచుకోవాలన్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌తోపాటు స్థానిక ఏడు జిన్నింగ్ మిల్లులను సీసీఐ నోటిఫై చేసిందన్నారు. మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేశం, రాజా, అడ్తి వ్యాపారుల సంఘం అధ్యక్షులు రాజేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

■ బుధవారం ఒక్కరోజే యార్డుకు 223 ట్రాలీల విడిపత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో విడిపత్తి కనిష్ఠ ధర రూ. 6 వేల నుంచి రూ.7 వేల దాకా పలికింది. మంగళవారం కంటే తాజాగా రూ.200 పెరిగింది.



పత్తి కొనుగోలును ప్రారంభిస్తున్న వరంగల్ ఆర్‌జేడీఎం శ్రీనివాస్

ఎమ్మెల్యే గంగులకు పరామర్శ



లక్ష్మీనర్సమ్మ భౌతికకాయం వద్ద మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తదితరులు

రాంపూర్ (కరీంనగర్), న్యూస్‌టుడే: కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ తల్లి లక్ష్మీనర్సమ్మ మృతిచెందడంతో పలువురు బుధవారం కరీంనగర్‌లో గంగుల కమలాకర్‌ను పరామర్శించారు. వీరిలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు టి.హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కౌశిక్‌రెడ్డి, సత్యం, ఎంపీ వి.రవిచంద్ర, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రవిశంకర్, రామకృష్ణారెడ్డి, మేయర్ వై.సునీల్‌రావు, భారాస జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, సుడా ఛైర్మన్ నరేందర్ రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తదితరులు ఉన్నారు. లక్ష్మీనర్సమ్మ అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు.

అధిక ధరలకు విక్రయం..

రూ.లక్షల్లో అక్రమం

వెండర్ల స్టాంపు పేపర్ల బాగోతం



న్యూస్‌టుడే, కరీంనగర్ సంక్షేమ విభాగం

స్టాంపు పేపర్లు అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు కొందరు స్టాంప్ వెండర్లు. రిజిస్ట్రేషన్ శాఖలో క్రయవిక్రయాలు జరిపేందుకు స్టాంపు పేపర్లు అవసరమవుతాయి. వివిధ పనుల కోసం ఉద్యోగులకు... నూతన ఉద్యోగాలలో చేరడానికి నిరుద్యోగులకు, ఉన్నత చదువు నిమిత్తం విద్యార్థులకు ప్రభుత్వ కార్యాలయాలలో స్టాంపు పేపర్లు కావాల్సి ఉంటుంది. తెలిసిన వారు వెళ్తే 100 స్టాంపు కాగితం రూ.120, తెలియని వారు వెళ్తే అదే స్టాంపు కాగితం రూ.150 వరకు విక్రయిస్తున్నారు. తీసుకుంటే తీసుకోండి లేదంటే మీ ఇష్టం.. అనే సమాధానం వస్తుందని పలువురు కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. ఈ తతంగం అంతా ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో జరగడంలేదు. అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల సమీపంలోని కొందరు గదులు అద్దెకు తీసుకొని అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. ఈవిషయంలో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఏటా 50 లక్షలకు పైగా సరఫరా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 14 రిజిస్ట్రేషన్ కార్యాలయాలున్నాయి. ఏటా ప్రధాన కార్యాలయం నుంచి కరీంనగర్ ప్రధాన రిజిస్ట్రేషన్ కార్యాలయానికి 50 లక్షలకు పైగానే స్టాంపు పేపర్లు వస్తున్నాయి. వీటన్నింటిని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అందజేస్తారు. వారు లైసెన్సు పొందిన స్టాంప్ వెండర్లకు అందజేస్తారు. అధికారులు వచ్చిన వాటిని స్టాంప్ వెండర్లకు అందించడం వరకే బాధ్యత తీసుకుంటున్నారు. అనంతరం వారు ఎంతకు విక్రయిస్తున్నారు. నిబంధనలు ఏంటని అటు వైపు చూడటమే మానేశారు.


చూస్తే చిల్లరే.. లెక్కిస్తే భారీ మొత్తం

ఎంత ధర ఉంటే అంతకే విక్రయించాలని నిబంధనలున్నా వాటిని తుంగలో తొక్కుతున్నారు. దాదాపు ప్రతి పనికి స్టాంపు పేపర్లు అత్యంత కీలకం. వివిధ రకాల ఒప్పందాలకు, వాహన క్రయవిక్రయాలకు, అప్పులకు చాలా అవసరం. వారికి ఉన్న అత్యవసర పరిస్థితిని ఆసరా చేసుకొని ఎక్కువగా విక్రయిస్తున్నారు. అధిక ధరకు విక్రయించేవారు ప్రతి రోజు దాదాపు 50కిపైగా విక్రయిస్తున్నారు. ఒక్కో దానిపై రూ.50 అధికంగా తీసుకున్నా రోజుకు రూ.2500 వరకు వస్తుంది. ప్రభుత్వం 5 శాతం కమీషన్ ఇస్తోంది. అక్రమ సంపాదనకు మరిగిన కొందరూ అందినకాడికి దండుకుంటున్నారు. ప్రతి వెండర్ అక్రమంగా నెలకు రూ.50,000 వరకు ఆర్జిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వంద మంది ఉన్నా.. రూ.50 లక్షల వరకు ప్రజలపై భారం పడుతోంది.

కూత వేటుదూరంలో ఉన్నా చూడరా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంతోపాటు అన్నీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో స్టాంప్ వెండర్ల దుకాణాలున్నాయి. అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేస్తే అన్నీ విషయాలు తెలుస్తాయి. అయితే వారు ఇప్పటివరకు తనిఖీ చేసిన సందర్భాలు లేవు. చాలామంది బహిరంగంగానే స్టాంపు కాగితాలు అధిక ధరకు తీసుకుంటున్నారని ఆరోపించినా.. ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 150 మందికిపైగా స్టాంప్ వెండర్లు ఉంటే అందులో దాదాపు అధిక మంది ఎక్కువ ధరకే విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల అంత ఒక్కటై విక్రయిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే లైసెన్సు రద్దు



వెండర్లు నిబంధనల ప్రకారం ఉన్న ధరకే స్టాంపు కాగితాలు విక్రయించాలి. ఎవరికైనా అధికంగా విక్రయిస్తే సమీపంలోని అధికారుల దృష్టికి తీసుకురావాలి. విచారణ చేసి వారి లైసెన్సులు రద్దు చేస్తాం. మొదట ప్రజలు ప్రశ్నించే దృక్పథం అలవాటు చేసుకోవాలి.

- ప్రవీణ్‌కుమార్, ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్

వేములవాడలో చిన్నారి విక్రయం కలకలం

పోలీసులకు తల్లి ఫిర్యాదు



బిడ్డతో శ్యామల

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలో ఓ చిన్నారి విక్రయం కలకలం రేపింది. భిక్షాటన చేసే ఓ మహిళ తాగిన మైకంలో పది నెలల పాప మేఘనను మరో మహిళకు విక్రయించి, తిరిగి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లారెడ్డిపేటకు చెందిన శ్యామల, రవీందర్ దంపతులు గత కొంత కాలంగా వేములవాడలో నివాసం ఉంటున్నారు. రాజన్న ఆలయ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఐదుగురు సంతానం కావడంతో చిన్నపాపను విక్రయించాలని భార్యాభర్తలు నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని గతంలో తమకు పరిచయం ఉన్న జగిత్యాల జిల్లా గోవింద్‌పల్లెకు చెందిన లక్ష్మికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో వేములవాడ వచ్చిన లక్ష్మితో పాటు శ్యామల కుటుంబ సభ్యులు మంగళవారం తిప్పాపూర్‌లో మద్యం తాగారు. తాగిన మైకంలో రూ.90 వేలకు లక్ష్మికి విక్రయించారు. స్టాంప్ పేపరుపై రాయించి ఇచ్చారు. బుధవారం తన పాపను లక్ష్మి అపహరించిందని శ్యామల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. తనకు రూ.90 వేలకు విక్రయించారని లక్ష్మి తెలిపింది. ఆమె వద్ద ఉన్న బాలికను తిరిగి శ్యామలకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీర ప్రసాద్ తెలిపారు.

4 నుంచి ఎల్‌ఎల్‌ఎం పరీక్షలు

కరీంనగర్ కలెక్టరేట్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించే ఎల్‌ఎల్‌ఎం రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 4 నుంచి నిర్వహిస్తున్నట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.ఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు కూడా అదే రోజు నుంచి మొదలవుతాయని.. ఎల్‌ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 6 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

న్యూస్‌టుడే, కోనరావుపేట

? పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి ఇరవై రోజులు అయింది. వారం రోజుల క్రితం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అదనపు కలెక్టర్ కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ధాన్యం తేమశాతం వచ్చినా తూకం వేయడం లేదు. రోజుల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. - **పుల్లూరి శ్రీనివాస్, రైతు, నిజామాబాద్**

✔ తూకం వేసిన ధాన్యం తరలించడానికి రైస్ మిల్లుల కేటాయింపునకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదు. మిల్లుల కేటాయింపు కాగానే తూకాలు వెంటనే ప్రారంభించి కొనుగోలు వేగవంతం జరిగేలా చర్యలు తీసుకుంటాం. - **కేశవులు, సీఈవో, పీఏసీఎస్, కోనరావుపేట**

న్యూస్‌టుడే, ముస్తాబాద్

? ముస్తాబాద్ నుంచి మొర్రాయిపల్లె వెళ్లే రోడ్డు పక్కన చెత్తాచెదారం వేస్తున్నారు. పాదచారులు, వాహనదారులకు ఇబ్బందిగా మారింది. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలి.
- **శ్రీనివాస్, వాహనదారుడు**

✔ క్షేత్రస్థాయిలో పరిశీలించి రోడ్డుపక్కన చెత్తాచెదారం తొలగించేందుకు చర్యలు చేపడతాం. చెత్త వేయకుండా సిబ్బంది ద్వారా పరిసర ఇళ్ల వారిని హెచ్చరిస్తాం. - **రమేశ్, ఈవో, ముస్తాబాద్**

గ్రామీణ రహదారులకు నిధులు

ప్రజలకు తీరనున్న రవాణా కష్టాలు

న్యూస్‌టుడే, కోనరావుపేట

గ్రామీణ రహదారులకు ఎట్టకేలకు మోక్షం లభించనున్నది. పక్కా రహదారులు, వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో అధికారులు టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పనులు పూర్తయితే ప్రజలు, వాహనదారులకు రవాణా కష్టాలు తొలగనున్నాయి.


మంగళ్లపల్లిలో గుంతలమయంగా మారిన ప్రధాన రోడ్డు

కోనరావుపేట మండలం రామన్నపేట-కొలనూర్ గ్రామాల మధ్య పెద్ద చెరువు మత్తడి దూకడంతో కల్వర్టు శిథిలావస్థకు చేరింది. దీంతో హైవంతెన, తారు రోడ్డు నిర్మాణానికి రూ.1.9 కోట్లు మంజూరయ్యాయి.

● మంగళ్లపల్లి తారు రోడ్డుకు రూ.1.3 కోట్లు, మల్కపేటలో కాళేశ్వరం రిజర్వాయర్ కట్టపై నిర్మించిన కోదండరామస్వామి ఆలయం నుంచి ప్రధాన రహదారి వరకు రెండు వరుసల రహదారి వరకు సీసీ రోడ్డుకు రూ.90 లక్షలు వచ్చాయి.

● పల్లిమక్తలో సీసీ రోడ్డుకు రూ. 1.60 కోట్లు, చందుర్తి మండలం మూడపల్లి ప్రయాణ ప్రాంగణం-ఉన్నత పాఠశాల మధ్య హైలెవల్ కల్వర్టు, సీసీ రోడ్డుకు రూ.80 లక్షలు, సనుగుల-గంగిరెడ్డుల కాలనీ మధ్య తారు రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయలు మంజూరయ్యాయి. చాలా ఏళ్లుగా సరైన రవాణా సౌకర్యం లేక వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిధులు మంజూరు కావడంతో పనులు పూర్తి చేస్తే కష్టాలు తీరనున్నాయి.


కొలనూర్-రామన్నపేట మధ్య శిథిలావస్థకు చేరిన లోలెవల్ కల్వర్టు

భారీ వర్షం కురిస్తే...



ఏటా వర్షాకాలంలో భారీ వర్షం కురిస్తే కోరుట్ల-వేములవాడ మధ్య ఎగువ నుంచి వరద పారడంతో తరచూ మూడపల్లికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎప్పుడు వర్షం కురుస్తుందో, ఎప్పుడు రాకపోకలు నిలిచిపోతాయో తెలియని పరిస్థితి ఉంది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నిధులు మంజూరు కావడంతో రవాణా ఇబ్బందులు తీరనున్నాయి. - **సార శ్రీనివాస్, మూడపల్లి, వాహనదారుడు**

ప్రభుత్వ విప్ చొరవతో..



గ్రామానికి బస్సు సౌకర్యం లేదు. కొలనూర్-రామన్నపేట మధ్య లోలెవల్ కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ యుద్ధప్రాతిపదికన హైవంతెన, రహదారికి నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపటం సంతోషంగా ఉంది.
- **నేతుల దేవరాజు, రైతు, రామన్నపేట**

టెండరు పిలుస్తాం



కోనరావుపేట, చందుర్తి మండలాల్లో రహదారుల నిర్మాణానికి మంజూరైన నిధులతో పనులు చేపట్టేందుకు సర్వే చేసే పనులు చేపట్టాం. టెండరు పిలిచి గుత్తేదారును ఖరారు చేస్తాం. వీలైనంత తొందరగా నాణ్యత ప్రమాణాలతో నిర్మాణ పనులు పూర్తి చేసి రవాణా వ్యవస్థ మెరుగుకు చర్యలు తీసుకుంటాం.
- **పవనకుమారి, పంచాయతీరాజ్ డీఈ, చందుర్తి**

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో సమావేశం

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆర్డీవో రాజేశ్వర్ సమావేశం నిర్వహించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్షించారు. ఫారం 18 ద్వారా, ఉపాధ్యాయులు ఫారం 19 ద్వారా ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. 06.11.2024 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ మహేశ్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పి.నరేందర్, పి.హన్మాండ్లు, రామస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, డీఏవోలను కలిసిన ఏఎంసీ ఛైర్‌పర్సన్

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ ఛైర్‌పర్సన్ షేక్ సాబేరాబేగం బుధవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగంను సిరిసిల్లలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైన నేపథ్యంలో రైస్ మిల్లులను కేటాయించాలని కోరారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యం ఎగుమతికి లారీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్ ఉన్నారు.

నిత్యాన్నదాన సత్రానికి విరాళం అందజేత

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ నిత్యాన్నదాన సత్రానికి ముంబయికి చెందిన భక్తులు డాక్టర్ రామ్‌చంద్ర పద్మావార్ దంపతులు బుధవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ అకౌంట్స్ సెక్షన్ అధికారులకు చెక్కును అందజేశారు. అంతకు ముందు వారు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వారికి అర్చకులు వేదాశీర్వచనం ఇచ్చి స్వామివారి ప్రసాదం అందజేశారు.


అధికారులకు చెక్కు అందజేస్తున్న డాక్టర్ రామ్‌చంద్ర పద్మావార్ దంపతులు

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంగూరి రంజిత్ కోరారు. బుధవారం విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని కోరారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో మెస్ ఛార్జీలు పెంచాలని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల నూతన భవనాన్ని నిర్మించి రెగ్యులర్ స్టాఫ్‌ను నియమించాలన్నారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థుల హాస్టల్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వాలని, ప్రతి విద్యాసంస్థలో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఈశ్వర్, నిశాంత్, మనీష్, నిరీక్షణ, మిస్బా, అఖిల, సౌజన్య, శ్రావణి, నవ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఇంటి గోడ విషయంలో దాడి చేసిన వ్యక్తికి జైలు

నేర వార్తలు

చందుర్తి, న్యూస్‌టుడే: ఇంటి గోడ విషయంలో దాడి చేసిన వ్యక్తికి రెండు సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.2000 జరిమానా విధిస్తూ జడ్జి జ్యోతిర్మయి తీర్పు చెప్పినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన గట్టు మోహన్, అదే గ్రామానికి చెందిన గట్టు వసంతకు 16.8.2014న ఇంటి గోడ విషయంలో గొడవ జరిగింది. వసంతను తిట్టడంతోపాటు ఆమెను మోహన్ కొట్టగా కుడి చేతి వేలు విరిగింది. బాధితురాలు చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో జడ్జి శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

రుణం ఇప్పిస్తామని మోసం చేసిన ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ స్కీం ద్వారా రుణం ఇప్పిస్తామని చెప్పి మోసం చేసిన ఇద్దరిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. మానకొండూర్ మండలం సదాశివపల్లెకు చెందిన మౌనిక, కరీంనగర్‌కు చెందిన కందుకూరి శ్రీధరాచారిలు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 12 మంది నుంచి రుణం ఇప్పిస్తామని చెప్పి రూ.3.45 లక్షలు తీసుకుని తప్పించుకుని తిరుగుతున్నట్లు చెప్పారు. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన బండారి శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా బుధవారం వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రెండు చరవాణులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితుడికి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: మండలంలో బండలింగంపల్లిలోని సాయిబాబా ఆలయంలో చోరీకి పాల్పడిన గంభీరావుపేటకు చెందిన సంతోష్‌ను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. సాయిబాబా ఆలయంలో మూడు రోజుల కిందట చోరీ చోటుచేసుకుందని పేర్కొన్నారు. హుండీ పగులకొట్టి అందులోని రూ. 4 వేలను ఎత్తుకెళ్లారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఆలయ పరిసరాల్లో అమర్చిన సీసీ కెమెరాల ఆధారంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు నిందితుడిని గుర్తించి, తమకు సమాచారం అందించగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న సంతోష్‌ను పట్టుకున్నట్లు చెప్పారు. అతని వద్ద నుంచి రూ.1,800 నగదు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనపర్చుకున్నట్లు పేర్కొన్నారు.

రెండు కార్లు ఢీకొని 8 మందికి తీవ్ర గాయాలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణ పరిధిలో రగుడు శివారులోని బైపాస్ రోడ్డులో రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో 8 మందికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... మెదక్ జిల్లా నిజాంపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్, షేక్ జానీ, మహమ్మద్ ఖలీల్, మహమ్మద్ ఆలీ హుస్సేన్, మహమ్మద్ కాసిం, డికావాల్ బేగం, ఎండి సల్మా, ఎండి సహిల్‌లు కారులో వేములవాడలో పెళ్లి చూపులకు వెళ్తున్నారు. రగుడు శివారులో వేములవాడ నుంచి వస్తున్న మరో కారును ఎదురుగా ఢీకొని రోడ్డు కిందకు దూసుకెళ్లడంతో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: వేములవాడ అర్బన్ మండలం అనుపురం శివారులో వేములవాడ- కరీంనగర్ ప్రధాన రహదారి పక్కన గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. దాదాపు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి పరిసరాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని సిరిసిల్ల జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిస్తే వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయిస్తే మద్దతు ధర వస్తుందని మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు రామరెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ రాంచంద్ర తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఎలగందుల ప్రసాద్, వినయ్‌కుమార్, ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, పసుల వెంకటి, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల గ్రామీణం: సిరిసిల్ల పట్టణ పరిధిలోని 10, 22వ వార్డుల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిరిసిల్ల మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు వెలుముల స్వరూప, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని ముస్తఫానగర్, గజసింగవరం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కేడీసీసీబీ అధ్యక్షుడు రవీందర్‌రావు గజసింగవరం గ్రామంలో ప్రారంభించారు. భారాస నాయకులు, రైతులు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


ఇల్లంతకుంట: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


గజసింగవరంలో ప్రారంభిస్తున్న రవీందర్‌రావు

వేములవాడ గ్రామీణం: ఫాజుల్‌నగర్, నూకలమర్రిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ ఛైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ లక్ష్మీకాంతారావు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంతోపాటు శాంతినగర్, బావుసింగ్‌తండాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను బుధవారం వీర్నపల్లి ఏఎంసీ ఛైర్మన్ రాములునాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ లక్ష్మణ్, మాజీ సర్పంచి దినకర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అరుణ్‌కుమార్, మాజీ ఉప సర్పంచి రవి, ఐకేపీ ఏపీఎం నర్సయ్య, సీసీ రాధ, నాయకులు తిరుపతి, రవీందర్, మంజుల, చంద్రమౌళి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు

ఈనాడు స్పందనకు వందనం

వీర్నపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఇళ్లకు తాగునీటి సరఫరా పునరుద్ధరణ పనులను అధికారులు బుధవారం చేపట్టారు. 'ఈనాడు'లో ఈనెల 23న 'బిందెడు నీరు రావట్లేదు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు, స్థానిక నాయకులు స్పందించారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తాగునీటి పైపులు ధ్వంసమవడం వల్ల సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బిందెడు నీటి కోసం స్థానిక మహిళలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, నాయకులు బోయిని రవి, సిబ్బంది నాంపల్లి, నర్సయ్య ఆధ్వర్యంలో ఉన్న పైప్‌లైన్‌ను పరిశీలించారు. పైపులైన్ అడ్డంగా ఉన్న ఫోర్లైన్, మట్టిని తొలగించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు.


పనులు చేయిస్తున్న ఏఈ అనిల్, కార్యదర్శి తిరుపతి, నాయకులు

ఘనంగా స్వాగతోత్సవం

గంభీరావుపేట, న్యూస్‌టుడే: గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు స్వాగతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి మాట్లాడుతూ బాగా చదువుకుని భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వైద్యుల నియామకానికి ముఖాముఖి

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పలు వైద్య పోస్టులను ఒప్పంద పద్ధతిలో భర్తీ చేసేందుకు బుధవారం ముఖాముఖి నిర్వహించారు. ఆసుపత్రిలోని రక్తనిధి, అత్యవసర వార్డుల్లో ఖాళీగా ఉన్న నాలుగు పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 9 మంది హాజరుకాగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధ్యక్షతన అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ముగ్గురిని ఎంపిక చేసినట్లు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వసంతరావు, వైద్య కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

బాధిత కుటుంబానికి రూ. 82 వేల ఆర్థికసాయం

రాచర్ల గొల్లపల్లి (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: తమకు పాఠాలు బోధించిన ప్రైవేటు ఉపాధ్యాయుడు అకాల మరణం చెందగా పూర్వ విద్యార్థులు బాధిత కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లికి చెందిన మారెల్లి నాగరాజు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొన్ని సంవత్సరాలు విద్యావాలంటీరుగా పని చేశాడు. ఆటో ఢీకొనడంతో ఇటీవల మృతి చెందాడు. పూర్వ విద్యార్థులు రూ. 82 వేలను మృతుడి కుమారుడు శిశ్వ పేరిట తపాలాశాఖ కార్యాలయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, బాండును భార్య వసుధకు అందజేశారు.


బాండ్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అక్రమాలపై నిలదీత

చందుర్తి, న్యూస్‌టుడే: చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అక్రమాలపై డైరెక్టర్‌లు ప్రశ్నించారు. రైతుల వద్ద నుంచి ఎరువుల బస్తాలకు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. యూరియా బస్తా రూ.266 కాగా, రూ.270లకు రైతులకు విక్రయించారు. కాంప్లెక్స్ ఎరువుల బస్తా ధర రూ.1,120 ఉండగా రూ.1,150లకు విక్రయించారు. ఎరువులు, గోనె సంచులకు సంబంధించి లెక్కలు చెప్పాలని డైరెక్టర్లు పట్టుబట్టారు. లెక్కలు చూపించిన తరవాతే పంట కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సీఈవో శ్రీమాన్, పీఏసీఎస్ ఛైర్మన్ తిప్పని శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ మోహన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బుసకొట్టిన నాగుపాము.. స్థానికుల బెంబేలు

రాచర్ల గొల్లపల్లి(ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలోని ఓ ఇంటి ఆవరణలోకి బుధవారం నాగుపాము దూరింది. రాజేశం ఇంటి మెట్లపైకి చేరింది. దాన్ని నెమ్మదిగా అక్కడి నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నించగా కిందకు దిగింది. ప్రహరీ లోపల ఓ మూలన ఉన్న బోరుమోటారు పక్కన చేరి బుసలు కొట్టింది. సుమారు గంటపాటు అక్కడే ఉండిపోవడంతో స్థానికులు బెంబేలెత్తారు. చివరికి బయటకు వెళ్లిపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.


మోటారు వద్ద నాగుపాము

కుక్క దాడిలో పలువురికి గాయాలు

కోనరావుపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో కుక్క దాడిలో పలువురికి గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామ శివారులోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల సముదాయం ఆవరణలోకి కుక్కలు చొరబడ్డాయి. విద్యార్థులపై దాడి చేస్తాయని భావించిన పాఠశాల స్వీపర్ బొల్లె నర్సయ్య వాటిని వెళ్లగొట్టేందుకు కర్ర తీసుకుని వెళ్లాడు. ఓ కుక్క ఒక్కసారిగా దాడి చేయగా స్వీపర్‌తోపాటు విద్యార్థులు రాహుల్, రవళి, మరో ఇద్దరు గాయపడ్డారు. బాధితులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి వేణుమాధవ్ వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విప్ చొరవతో కళాశాలలో తీరిన నీటి కొరత

రుద్రంగి, న్యూస్‌టుడే: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నీటి కొరత తీరింది. కళాశాలలో ఉన్న బోరుబావి కూరుకుపోయి నీరు రాకపోవటంతో మూడేళ్లుగా నీటి కొరతతో విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల కళాశాలను సందర్శించిన విప్ వెంటనే బోరుబావికి మరమ్మతులు చేయించి నూతన బోర్ మోటార్ బిగించారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, నారాయణ, లింగం, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుకు డిమాండ్

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని మాదిగ, మాదిగ ఉప కులాల ఐక్యవేదిక కన్వీనర్ కత్తెర దేవదాస్ డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్లలో మాదిగ, మాదిగ ఉప కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. భారాస ప్రభుత్వ హయాంలో మాదిగల భూములను ప్రభుత్వ అవసరాలకు తీసుకున్న బాధితులకు నష్టపరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు అంకని భాను, కానపురం లక్ష్మణ్, బొడ్డు రాములు, ప్రభాకర్, లింగంపల్లి సత్యనారాయణ, ఆవునూరి వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.


సిరిసిల్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐక్యవేదిక నాయకులు

క్షయ నిర్మూలనకు కృషి

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: క్షయ రహిత జిల్లాగా రాజన్న సిరిసిల్లను మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఇంపాక్ట్ ప్రోగ్రాం జిల్లా అధికారి దండుబోయిన శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం ఇల్లంతకుంట మండలంలోని రహీంఖాన్‌పేట, కందికట్కూర్, వల్లంపట్ల గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలు, ఆయుష్మాన్ కేంద్రాలలో క్షయ నివారణపై ఆశా కార్యకర్తలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచంలోనే అధిక సంఖ్యలో భారతదేశంలో ఈ కేసులు ఉన్నాయని, వీటివల్ల మరణాల సంఖ్య అధికంగా ఉన్నట్లు తెలిపారు. క్షయను దూరం చేసేందుకు ప్రభుత్వం రాష్ట్రంలోని అయిదు జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. క్షయను జయించిన వారిని క్షయ ఛాంపియన్‌గా గుర్తించి వారికి శిక్షణ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వారి ద్వారా వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శరణ్య, సీహెచ్‌వో శాంత, హెచ్‌ఈవో వెంకటరమణ ప్రసాద్, పీహెచ్ఎన్ తారాబాయి, సూపర్‌వైజరు జవహర్, ఎంఎల్‌హెచ్‌పీ నవనీత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ గోపుర పూజ

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీకేశవపెరుమాండ్ల ఆంజనేయస్వామి ఆలయ గోపుర పూజను బుధవారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు త్రివిక్రమ విష్ణు ఆచార్య, విజయ ఆచార్య, శిల్పి అరుణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రాంరెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగంగౌడ్, కోశాధికారి నరేశ్, రెడ్డి సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల రహదారిపై వివాదం

చందుర్తి, న్యూస్‌టుడే: చందుర్తి మండలం జోగాపూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలకు రహదారి నిర్మాణంపై బుధవారం వివాదం చోటుచేసుకుంది. పాఠశాలకు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, దానివల్ల తమ వ్యవసాయ భూమి పోతుందని ఇద్దరు రైతులు పనులను అడ్డుకున్నారు. అయితే రోడ్డు నిర్మాణం చేపట్టాలని విద్యార్థులు, గ్రామస్థులు ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి రుద్రంగి ఎస్ఐ అశోక్ చేరుకుని వివాదాన్ని పరిష్కరించారు.

బోయినపల్లి తహసీల్దారు బదిలీ

బోయినపల్లి, న్యూస్‌టుడే: బోయినపల్లి తహసీల్దారు పుష్పలతను బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ నుంచి జిల్లాకు వచ్చిన తహసీల్దారు నారాయణరెడ్డిని బోయినపల్లికి కేటాయించడంతో బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

పీఏసీఎస్‌ను సందర్శించిన నాబార్డు ప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని నాబార్డు ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. నాబార్డు ఏజీఎం అభిషేక్ (ముంబయి), హైదరాబాద్ ఏజీఎం అప్సద్, బోస్టన్ ఇండియా ప్రతినిధి ఆర్యన్, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, పీఏసీఎస్ అభివృద్ధి సెల్ మేనేజర్ సత్యనారాయణ, కేడీసీసీబీ జనరల్ మేనేజర్లు శ్రీధర్, రియాజ్, నాబార్డు డీడీఎం జయప్రకాశ్ పీఏసీఎస్ కార్యాలయ సందర్శన అనంతరం ఛైర్మన్ గుండారపు కృష్ణారెడ్డితో సమావేశమయ్యారు. సహకార సంఘం ద్వారా రైతులకు అందుతున్న సేవలు, రుణాల వివరాలు, వ్యాపార కార్యక్రమాలపై ఆరా తీశారు. వ్యాపార, ఆర్థిక, ప్రభుత్వ పరంగా సంఘం బలోపేతానికి నాబార్డు ద్వారా ఎలాంటి సహకారం అందించాలని అడిగి తెలుసుకున్నారు. రైతులకు సంఘం అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నాబార్డు బృందంతో పీఏసీఎస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, సిబ్బంది

పోత్గల్ (ముస్తాబాద్): పోత్గల్ సహకార సంఘం కార్యాలయాన్ని నాబార్డు బృందం బుధవారం సందర్శించింది. సంఘం ద్వారా సంఘ సభ్యులకు, రైతులకు అందిస్తున్న సేవలను సహకార సంఘ అధ్యక్షుడు తన్నీరు బాపురావును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. సేవలను మరింత విస్తృతం చేయడానికి నాబార్డు ద్వారా పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.